క్లుప్తంగా

వాహనాల తనిఖీ



చెన్నారావుపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జయముఖి కళాశాల సమీపంలో పోలీసులు, అధికారులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు సంపత్, రమేశ్ మాట్లాడారు. ఆధారాలు లేకుండా పెద్దమొత్తంలో నగదు తీసుకెళ్లొద్దని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

బోర్ పరికరాల చోరీ

నల్లబెల్లి : మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బట్టు సాంబయ్యకు చెందిన వ్యవసాయ బోర్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు చోరీ జరిగినట్టు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. సాంబయ్య ముచ్చింపుల శివారు బావునికుంట సమీపంలోని తన వ్యవసాయ భూమిలో బోర్ వేయించుకోగా బోర్ పక్కనున్న స్టాటర్, ప్లగ్గులు, బాక్స్, 25 మీటర్ల కరెంటు వైర్, డ్రిప్పు పైపులను చోరీ చేశారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పలయ్య (65) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులైన నందనం సొసైటీ డైరెక్టర్ బిర్రు పద్మ, కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ ముంజ చేరాలు, బిర్రు దేవేందర్, బాబులను మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. మార్నేని వెంట సీసీ గోలి కొమురయ్య, నాయకులు బిర్రు మహేందర్, బొక్కల నారాయణ, మిద్దెపాక రవీందర్, ముత్యం దేవేంద్ర సంపత్, దుగ్యాల జ్యోతి మాధవరావు ఉన్నారు.

నేడు తైబజార్ వేలం

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ తైబజార్‌కు నేడు (బుధవారం) స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి మోయినొద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు సంతలో వసూలు చేయడానికి వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు రూ.2 లక్షలు ధరావతు, రూ.500 షెడ్యూల్ ధర చెల్లించి రశీదు పొందాలని, గ్రామ పంచాయతీకి పన్నులు బాకీ ఉండకూడదని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి, పున్నేలు, రెడ్డిపాలెం 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో చేపట్టే మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్, ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని వనమాల కనపర్తి, కొండపర్తి, పున్నేలు, రెడ్డిపాలెం గ్రామాల గృహావసరాల కనెక్షన్‌తోపాటు వ్యవసాయ కనెక్షన్ కలిగిఉన్న వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించడమే లక్ష్యం'

నర్సంపేట : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీను ఓడించడమే లక్ష్యంగా బహుజనులు ఏకం కావాలని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో బహుజన నాయకుల వైఫల్యాల వల్లే డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశించిన బహుజన రాజ్యస్థాపనకు భంగం కలిగిందని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇకనైనా బహుజన కుల సంఘాలు సమిష్టి రాజకీయ ఎజెండాతో ముందుకు సాగాలని సూచించారు.

రేణుకా ఎల్లమ్మకు ఘనంగా బోనాలు

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం పద్మశాలీలు అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. బొల్లికుంట, మామునూరు గ్రామాలకు చెందిన పద్మశాలీ మహిళలు శాస్త్రోక్తంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయం ప్రాంగణంలో పట్నం వేసి మహిళలు భక్తిశ్రద్ధలతో పర్వన్నాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి జాతర

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి జాతర మంగళవారం వేడుకగా ప్రారంభమైంది. మొక్కులు చెల్లించడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నృసింహస్వామికి ఆలయ కమిటీ బాధ్యులు ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు శ్రీనివాస్, శివకుమార్ వేద మంత్రోచ్చారణల నడుమ పూజ కార్యక్రమాలు చేపట్టారు. పోటాపోటీగా ప్రభబండ్లు తరలివచ్చాయి. తహసీల్దార్ ఫణికుమార్, ఎస్సై గూడ అరుణ్‌కుమార్ పూజలు నిర్వహించారు.

ఘర్షణ వాతావరణం

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ప్రభబండ్లు తరలివస్తుండగా కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. తమ బండే ముందుగా వెళ్లాలంటూ ఆ రెండు పార్టీల నాయకులు తోపులాటకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇరు పార్టీల నాయకులను శాంతింపజేసి ప్రభబండ్లు జాతరకు చేరుకునేలా చర్యలు తీసుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దుగ్గొండి : మండలంలోని కేశవాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దేశికన్ చార్యులు ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త కంది సరళ జితేందర్‌రెడ్డి దంపతులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని గురుడవాహనంపై ఉంచి ఆలయం నుంచి గ్రామంలోని పుర వీధుల మీదుగా నీరుకుళ్ల వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కంది తిరుపతిరెడ్డి–పూలమ్మ, కంది మనోహర్‌రెడ్డి.సురేందర్‌రెడ్డి, ఈఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి : ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న సరళ జితేందర్‌రెడ్డి దంపతులు



చెన్నారావుపేట : ప్రభబండితో వస్తున్న భక్తులు

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న మాధవశంకర్ గుప్తా, సభ్యులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 25వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేవిశ్ మిశ్రా మూలవిరాట్టు స్వామి వారిని అలంకరించి పంచలోహ విగ్రహానికి పూజలు నిర్వహించి 18 కలశాలపై తాంత్రిక నైపుణ్యంతో 30 మంది దంపతులతో పూజలు చేయించారు. అనంతరం 25 కేజీల కేక్‌ను ఆలయ కమిటీ, భక్తులు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మిడిదొడ్డి బాబురావు పద్మావతి, భూపతి లక్ష్మీనారాయణ నాగలక్ష్మి, మాదారపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, దోమకుంట్ల సదానందం, వంగేటి గోవర్ధన్, చింతల కమలాకర్‌రెడ్డి, ఆకుల ప్రభాకర్, దొడ్డ వేణు, మల్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



నెక్కొండ : మండలంలోని అలంకానిపేటకు చెందిన గుంటుక రమేశ్‌కు అతడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కానిస్టేబుల్ పున్నంచందర్ పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం అందజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రమేశ్ ఏడాది క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు పోర్టల్‌లో దరఖాస్తు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు ట్రాక్ చేసి అప్పగించారు. సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేసి బాధితుడికి అప్పగించడంలో సమర్థవంతంగా వ్యవహరించారంటూ పీఈఐఆర్ ఆపరేటర్, కానిస్టేబుల్ పున్నంచందర్‌ను ఎస్సై మహేందర్ అభినందించారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటేసే అవకాశం

సంగెం : దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి ఇంటి వద్దే ఓటేసే అవకాశం కల్పించనున్నట్టు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు సెక్టోరల్ అధికారులు, సూపర్‌వైజర్లు ఎన్నికలకు సంబంధించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లోని 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారిని గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్, సెక్టోరల్ అధికారులు రమేశ్‌కుమార్, యాకయ్య, సాయిరాజ్, రోహిణి, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

అరూరికి సన్మానం

వరంగల్ : బీజేపీలో చేరిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రజుమంలో నాయకులు దండు చక్రపాణి, పస్తం సమ్మయ్య, దామెర సదానందం, అశోక్, ఎల్లంశెట్టి వీరస్వామి, కూచన భిక్షపతి, పిట్ట సరస్వతి, ఓర్సు దేవేందర్, చల్ల రాజు, తరాల కుమార్, సాంబయ్య, సూర రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల సంఘం కమిటీ ఎన్నిక

నెక్కొండ : స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆర్‌ఎంపీల సంఘం మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘం ముఖ్య సలహాదారులు కొంకాల సాంబయ్య మాట్లాడారు. అధ్యక్షుడిగా కుడికాల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి హరి, ప్రధాన కార్యదర్శిగా మాంకాల ఐలయ్య, కోశాధికారిగా బక్కి శంకర్, సహ కార్యదర్శిగా వాసుదేవ్, సలహాదారులుగా కుడికాల సాంబయ్య, రాచమల్ల వెంకటేశ్వర్లు, ధనుంజయ, కార్యవర్గ సభ్యులుగా శ్యాంసుందర్, మదార్, సతీశ్, వెంకన్న ఎన్నికైౖ నట్లు తెలిపారు. అనంతరం కార్యవర్గాన్ని ఘనంగా శాలువాలతో సన్మానించారు. తదనంతరం అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలు అందించడంలో ఆర్‌ఎంపీలు కీలకమని చెప్పారు. ఆర్‌ఎంపీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు శ్రావణ్, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, రాజు, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కుడికాల కుమారస్వామి



కొండపల్లి హరి

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని రంగశాయిపేటలో ప్రతిష్ఠించిన గ్రామ దేవత బొడ్రాయికి సోమవారం స్థానికులు పూజలు నిర్వహించారు. వేదపండితులు, బొడ్రాయి ఉత్సవ కమిటీ కన్వీనర్ యోగానంద–స్వరూప దంపతుల ఆధ్వర్యంలో బొడ్రాయికి అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు

ఖిలా వరంగల్ : అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడి పలువురు మహిళ కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఆవునూరి సునీత, నాగపూరి ఉమ(మౌనిక), యాకలక్ష్మి, మరుపల్లి దేవి, రెహాన్, జయ సోమవారం వసంతాపురం గ్రామానికి పత్తి ఏరేందుకు ఆటోలో కూలికి వెళ్లారు. సాయంత్రం ఉర్సు కరీమాబాద్‌కు బయల్దేరారు. ఈక్రమంలో రోడ్డుపై వెళ్తున్న ఆటోను ఇమ్మడి ప్రభాస్ అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యాడు. దీంతో ఆటో బోల్తా పడగా ఆవునూరి సునీత, నాగపూరి మౌనికకు తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిందరిని 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన ఆటో డ్రైవర్ ప్రభాస్, ద్విచక్ర వాహనదారుడు ప్రమోద్‌లపై చర్యలు తీసుకోవాలని ఆవునూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్ : హోలీ పండుగ సందర్భంగా సోమవారం మధ్యకోట గుండుచెరువులోకి స్నానానికి వెళ్లిన ముగ్గురిపై అమానుషంగా దాడిచేసిన పదిమంది యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. మధ్యకోటకు చెందిన మేకల రాజ్‌కుమార్, బోరబోయిన కార్తీక్, దేవబోయిన నాగరాజు హోలీ ఆడుకున్నారు. మధ్యాహ్నం గుండు చెరువులోకి స్నేహితులతో కలిసి వారు స్నానానికి వెళ్లారు. చెరువు వద్ద బొల్లం కార్తీక్, తాడుల భరత్, పుట్ట మహేష్, కుంజనపల్లి యశ్వంత్, తంగళ్లపల్లి నిఖిల్, పుష్పాల సంజయ్, పుష్పాల శ్రీధర్, కళ్యాణ్, సచిన్, గాదం భరత్ కలిసి మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న పదిమంది ఇటు ఎందుకు వచ్చారురా.. అంటూ దుర్భాషలాడుతూ ముగ్గురిపై దాడి చేశారు. అనంతరం మాట్లాడుకుందామని సాయంత్రం పడమరకోట పద్మశాలీ వీధికి పిలిచి బీరు సీసాలు, కర్రలతో దాడి చేయగా మేకల గణేష్ తలకు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. మధ్యకోట యాదవనగర్‌కు చెందిన మేకల గణేష్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ఇద్దరిపై..

హోలీ వేడుకల్లో దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. కరీమాబాద్ తోట్లవాడకు చెందిన శామంతుల సుమంత్, పల్నాటి సాయిరాం, పల్లం మనితేజ్ కలిసి పడమరకోట జంక్షన్‌కు వెళ్లారు. స్నేహితులతో కలిసి మాట్లాడి బైక్‌పై వెళ్తున్న ముగ్గరిపై బొల్లం కార్తీక్, నిఖిల్ దాడి చేసి గాయపర్చారు. బాధితుడు శామంతుల సుమంత్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై..

బైక్‌ను ఢీకొట్టిన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. నర్సంపేటకు చెందిన చొప్పరి చంటి (20) సిద్దార్థ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుక్స్ కొనేందుకు ఈనెల 20న నర్సంపేట నుంచి ద్విచక్రవాహనంపై వరంగల్ వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో నర్సంపేట రోడ్డు లేబర్ కాలనీలో ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చంటికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఎంజీఎం తరలించారు. బస్సు డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చంటి తండ్రి చొప్పరి శ్రీనివాస్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ఆలయంలో పారాయణం

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఓరుగల్లు సౌందర్యలహరి భక్త మండలి ఆధ్వర్యంలో మంగళవారం సౌందర్యలహరి స్తోత్రం, శివానందలహరి పారాయణం చేశారు. సుమారు 50 మంది సభ్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దీపారాధన, పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు శోభారాణి, జయశ్రీ, కమిటీ సభ్యులు బయ్య స్వామి, గోనె జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ కూటమి విజయంపై హర్షం

● కేయూ మొదటి గేట్ వద్ద సంబురాలు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని జేఎన్‌యూలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్ఐ కూటమి గెలుపొందడంతో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఎస్‌ఎఫ్ఐ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంబురాలు నిర్వహించుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. మతోన్మాద సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్‌ఎఫ్ఐ కూటమి విజయాన్ని ఆపలేక పోయారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానంపై కూడా వ్యతిరేకత పెల్లుబీకుతుందన్నారు. ఎస్‌ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు సాయికిరణ్, జనరల్ సెక్రటరీ స్టాలిన్, ఉపాధ్యక్షురాలు పరిమళ, మంద వికాస్, అనూష, మంధు, హాథిరాం, జస్వంత్, మంగిలాల్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కేయూలో ఇద్దరికి డాక్టరేట్ ప్రదానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు మహిళా పరిశోధకులకు మంగళవారం డాక్టరేట్‌ను ప్రకటించారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో కె.మాధవికి, చరిత్ర విభాగం పరిశోధకురాలు ఈదుల కంటి అనితకు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 'స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ దిస్ ప్లేస్‌మెంట్ ఏ స్టడీ ఆఫ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్‌ఇన్ తెలంగాణ స్టేట్' అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను కె.మాధవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. అలాగే 'ది రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ ద లెఫ్టిస్ట్ మూవ్‌మెంట్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ' అంశంపై ఆ విభాగం ఆచార్యులు పి.సదానందం పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికిగాను ఈదులకంటి అనితకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆచార్య నర్సింహాచారి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన మాధవిని, ఈదెలకంటి అనితను పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.

అసైన్డ్ భూముల్లో 'రియల్' దందా

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నర్సంపేట రూరల్ : కొందరు అక్రమార్కులు అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని పార్టీ బృందం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. పట్టణంలోని కాకతీయనగర్ శివారులోని సర్వే నెంబర్ 601/2లోని అసైన్డ్ భూమిని ఇటీవల కొందరు రైతుల నుంచి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములు వ్యవసాయం చేసేందుకు తప్ప విక్రయానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వ్యతిరేకమని చెప్పారు. విక్రయించినా, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినా పీఓటీ యాక్టు ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే విచారణ చేపట్టి సదరు అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం అక్రమానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్ఐ రజాక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, కలకోటి అనిల్, ఫరీదా, వర్ధంతి, విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, లక్ష్మీ, యాకలక్ష్మి, కొండి మల్లయ్య, నాగరాజు, వెంకన్న, తోటకూరి రజిత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్, నాయకులు

ఐక్యఉద్యమాలతోనే గీత వృత్తి రక్షణ

● మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నర్సంపేట : ఐక్యఉద్యమాల ద్వారానే గీత వృత్తిని రక్షించుకోగలమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకే ఎక్స్‌గ్రేషియా, ప్రమాద బీమా, సేఫ్టీ మోకులు, మోపెడ్, తదితరాలు ఇస్తామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరిస్తున్నాయని తెలిపారు. పాలక పార్టీలు మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో గీత కార్మికులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రమాదాల బారిన పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ఆదాయం కోసం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ గీత కార్మికుల బతుకులను దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు గౌడ కులస్తులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని చెప్పారు. రాజకీయాలకతీతంగా గౌడ కులస్తులు, గీత కార్మిక సంఘాలు ఏకమైతేనే సమస్యలు పరిష్కారమౌతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తదితరాలను వెంటనే విడుదల చేయడంతోపాటు గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని, నిర్వహణ కోసం రూ.5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిశాల సదానందం, రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు జూలూరి హరిప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాంపల్లి వెంకట్, నాయకులు గంప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

'యశోద' వైద్యసేవలు అభినందనీయం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

● ఉచిత మెగా వైద్యశిబిరం

నల్లబెల్లి : హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని రాంపూర్ మాజీ సర్పంచ్ చింతపట్ల సురేశ్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి యాజమాన్యం స్వగ్రామంపై మమకారంతో సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి మండలంలోని మేడపల్లి, రాంపూర్, తదితర గ్రామాల ప్రజలు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన ఆర్థో, గైనిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజిషియన్, చిల్డ్రన్, అంకాలజీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శిల్పరెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మణి సేవారణ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఖలీల్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ బాలరాజ్, డాక్టర్ రవికుమార్, స్థానిక నాయకులు మార్తినేని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరికలు

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించాడు. మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు చిట్టి వెంకన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 110రోజుల్లోనే రూ.10లక్షల సీసీరోడ్డు, రూ.2లక్షలతో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపాడు. దుబ్బగూడెం గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. పెద్దలకుంటలో రూ.50లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు, త్వరలోనే పైపులైను పనులు మొదలు పెడతామన్నాడు. ఆర్‌అండ్‌బీ రోడ్డు కోసం 14కిలో మీటర్లకు రూ.22కోట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరు చేసినట్లు పేర్కొన్నాడు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మాదవపెద్ది రమేష్ చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మధుగౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో మురళీ, నాయకులు

ఎల్ఎల్ఎం పరీక్షల పరిశీలన

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఎల్ఎల్ఎం పరీక్షల నిర్వహణను కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అవకతకవలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు నీటి వసతి ,నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన వారిలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్ ఉన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

వరంగల్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి కోరారు. ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు తీసుకుంటే కేసులు నమోదై ఉద్యోగాలకు అనర్హులవుతారని చెప్పారు. విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.